ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 18 సంచిక : 04 డిసెంబర్ 2012

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

నరసాపురం .... 24-10-2012

జిన్నూరు ......... 31-10-2012

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-10-2012, నరసాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

షిరిడిసాయిబాబాగారు శ్రీరామనవమి, గురుపూర్ణిమ ఈ రెండూ బాగా చేసేవారు. ఆయన హనుమంతుడి అంశవల్ల జన్మించారు. ఆయన జన్మ విషయాల గురించి ఆయన ఎవరికీ చెప్పలేదు. ఆయన బ్రాహ్మణకుటుంబంలో పుట్టాడు కాని పెంచటం ముస్లింలు పెంచారు అంటారు. ఆయనకు కులభేదం, మతభేదం లేదు. కులాలతోటి, మతాల తోటి, దేశంయొక్క హద్దులతోటి సంబంధం లేకుండా ఈ సృష్టినంతా సమానంగా ప్రేమించాడు. ఆల్ ఇండియా సాయి సమాఖ్య పెట్టి షిరిడీ సాయిబాబా పేరు ప్రపంచమంతా వ్యాప్తి చేసినవాడు బి.వి. నరసింహ స్వామి. ఆయన కుటుంబంతో ప్రయాణం చేస్తున్న కారు యాక్సిడెంట్ అయ్యి ఆయన తప్ప కుటుంబ సభ్యులంతా చనిపోయారు. అప్పుడు ఈ డబ్బు సంపాదన, గౌరవాలు ఇవి అన్నీ ఎవరికోసం అనే ప్రశ్న వచ్చి, ఆయనకు వైరాగ్యం కలిగి ఆరకంగా ఆయన రమణమహర్షిగారి దగ్గరకు వచ్చారు. ఆయన కష్టపడి సేకరించి 1930లో రమణమహర్షిగారి జీవితచరిత్ర వ్రాసారు. తరువాత కొంతకాలానికి షిరిడీవెళ్ళి బాబా గారికి ఎక్కువగా ఆకర్షింపబడ్డారు. మద్రాసులో మైలాపూర్‌లో ఉన్న బాబాగారి గుడి ఆయనే కట్టించారు. ఆ గుడి ఆవరణలోనే నరసింహ స్వామి గారి సమాధి ఉంది. ఆ సమాధి హాలులో మనం కూర్చుంటే మనకు ధ్యానస్థితి కలుగుతుంది, సమాధిస్థితి కలుగుతుంది. బాబాగారి ఔన్నత్యాన్ని మనం అంగీకరించినా, అంగీకరించకపోయినా ఆయన సిద్ధపురుషుడు, ఆత్మానుభవం పొందినవాడు.

అర్జునుడిని నిమిత్తమాత్రంగా చేసుకొని పరమాత్మ మనకు గీతను భోదించాడు. ఆవు దూడ మొదట కొన్ని పాలు తాగుతుంది, తరువాత మనకి పాలు పితుకుతారు. అలాగే అర్జునుడు మొదట ఆ పాలు తాగాడు, తరువాత మనందరం తాగుతున్నాము, అది గీతామృతం. అన్ని వేదాలసారం, ఉపనిషత్‌ల సారం భగవద్గీతలో ఉంది. మీరు చెప్పిన వాక్యానికి ప్రమాణం ఉందా అని ఎవరైనా రమణమహర్షిగారిని అడిగితే భగవద్గీతలోకాని, ఉపనిషత్‌లలో కాని ఏదో శ్లోకం చూపించేవారు. రామకృష్ణపరమహంసగారిని ఇటువంటి ప్రశ్నలు అడిగితే ప్రమాణం చూపించేవారుకాదు. ఏంటివయ్యా నీకు ప్రమాణం కావాలా? నేను అసత్యం చెప్పాను అనుకొంటే ప్రమాణం అడుగు. నేను ఎప్పుడూ సత్యమే చెపుతాను కాని అసత్యం చెప్పవలసిన పని నాకు లేదు. ప్రమాణం చూపించమని అడగటానికి నువ్వు ఎంతటి వాడవు? ప్రమాణాలు అంటావు ఏమిటి? నామాటే ప్రమాణం వెళ్ళిరా అనేవారు. ఎందుచేతనంటే ఆయనకు పబ్లిసిటీ అక్కరలేదు, ఏమీ అక్కరలేదు. రాయిని, మట్టిని, బంగారాన్ని ఒకేరకంగా చూసేవాడు. ఈ మూడింటిని తీసుకొని వెళ్ళి గంగానదిలో కలిపేవాడు. బంగారాన్ని కూడా నదిలో కలిపేవాడు ఎందుచేతనంటే బంగారం మీద ఏదైనా ఎటాచ్‌మెంట్ ఉందా అని చూసుకోవటానికి అలా చేసేవాడు, ఆయన అంత పరిశుద్ధుడు. భగవాన్‌కి రామకృష్ణుడికి తేడా ఏమిటి అంటే రమణుడు పైకి జ్ఞాని కింద కనపడేవాడు లోపల ఉన్నదంతా భక్తే. రామకృష్ణుడు పైకి భక్తుడి కింద కనిపించేవాడు, లోపల ఉన్నదంతా జ్ఞానమే. భక్తి తల్లి, పిల్లవాడు జ్ఞానం.

మన మెదడుకు అందని విషయాలు చాలా ఉన్నాయి. భగవద్గీతలో, ఉపనిషత్‌లలో చెప్పిన విషయాలు మన మెదడుకు అందవు, సైన్సుకి కూడా అందవు. ఎందుచేతనంటే సైన్స్‌ను నీ మెదడు క్రియేట్ చేసింది. నీ మెదడులో నుండి వచ్చిన భాగమే సైన్స్ అంతా. భగవద్గీత నీ మెదడులో నుండి వచ్చిందికాదు, అది చైతన్యంలో నుండి వచ్చింది అంటే చైతన్యమే కృష్ణుడి రూపంలో ఉండి మాట్లాడింది. నీ శరీరాన్ని ఎలాగైతే మనస్సు కల్పించిందో అలాగే నీ మెదడును కూడా మనస్సే కల్పించింది. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం కావాలంటే రమణమహర్షిగారు ఒక వాక్యం చెప్పారు. అది నన్ను బంధించింది. ఆ వాక్యం ప్రతీ మనిషినీ అంటే ఆస్థికుడిని, నాస్థికుడినీ అందరినీ అరెస్టు చేస్తుంది. మేము సమస్యలతో చచ్చిపోతున్నాము అంటారు కదా! నీకు కోటి సమస్యలు ఉన్నా వాటికి పరిష్కారం ఒక్కటే. ది సొల్యూషన్ టు ఆల్ యువర్ ప్రోబ్లమ్స్ ఈజ్ టు సీ హు హేజ్ యిట్. నీకు కోటి సమస్యలు ఉన్నా ఒకటే ప్రశ్న, ఈ సమస్యలు అన్నీ ఎవరికి ఉన్నాయి? అంతే అయిపోయింది. దేహం

జడం దానికి సమస్యలు ఏమిటి? చైతన్యానికి సమస్యలు ఏమిటి? దానికి ద్వితీయమే లేదు ఇంక సమస్యలు ఏమిటి? నువ్వు నేను, నేను అంటున్నావు కదా! ఈ సమస్యలు అన్నీ కూడా ఆ నేనుకే ఉన్నాయి. నువ్వు కంగారు పడవద్దు. ఈ సమస్యలు అన్నీ ఎవరికి ఉన్నాయి అని పరిశీలనలోనికి దిగితే ఎవరికి ఈ సమస్యలు ఉన్నాయో అది ఎంత అసత్యమో ఈ సమస్యలు కూడా అంతే అసత్యం అని నీకు తెలుస్తుంది. ఏ మిథ్యానేనును పట్టుకొని ఈ సమస్యలు అన్నీ వేలాడుతున్నాయో అది రాలిపోయినప్పుడు ఈ కోటిసమస్యలు కూడా రాలిపోతాయి. అందుచేత నువ్వు సమస్యలను కాదు చూడవలసింది, ఇవి అన్నీ ఎవరికి ఉన్నాయో చూడు. మాకు భయం వేస్తోంది అని చాలామంది అంటారు. నీ శరీరానికి భయం వేస్తోందా? నీ లోపల ఉన్న చైతన్యానికి భయం వేస్తోందా? లేదు. మరి ఎవరికి భయం వేస్తోంది? ఈ నేనుకే భయం వేస్తోంది. ఆ నేను ఎవరో నువ్వు పరిశీలనగా చూస్తే అది పడిపోతుంది. ఆ నేను పడిపోతే దానిని అంటిపెట్టుకొని ఉన్న సమస్యలు అన్నీ రాలిపోతాయి. ఇంక నువ్వు విడివిడిగా సమస్యలను పరిష్కారం చెయ్యనక్కరలేదు. మీరు సమాధానం కోసం ఎక్కడో వెదకవద్దు, ఇక్కడే చూడండి. ది సొల్యూషన్ టు ఆల్ యువర్ ప్రోబ్లమ్స్ ఈజ్ టు సీ హు హేజ్ యిట్. ఈ వాక్యాన్ని మీరు మననం చేసుకొంటే సమస్యలన్నీ ఏ నేనుకైతే ఉన్నాయో ఆ నేను పడిపోతుంది. ఈ సమస్యలు అన్నీ ఎవడికైతే ఉన్నాయో వాడిని పట్టుకోండి, వాడిని బోనెక్కించండి, వాడిని విచారణలో పెడితే పత్తాలేకుండా పోతాడు. వాడు పోయినప్పుడు వాడికి ఉన్న సమస్యలు అన్నీకూడా పోతాయి.

సమాజం చదువుకొన్నవారిని గౌరవిస్తుంది, ధనవంతులని గౌరవిస్తుంది. వాడికి ఉన్న ధనాన్నిబట్టిగాని, చదువునుబట్టిగాని రామకృష్ణపరమహంసగారు ఎప్పుడూ ఏ మనిషినీ గౌరవించలేదు. మీరు స్కూలులో, కాలేజీలో బాగా చదువుకున్నారు, దానివలన మీ స్వభావంలో ఏమైనా మార్పు వచ్చిందా? మీ స్వభావంలో మార్పు రాకుండా మీకు అసలు ఆత్మజ్ఞానం రాదు. రామకృష్ణపరమహంసగారు ఏమని చెప్పేవారు అంటే ఏ మనిషిని చూసినా వారి చదువుల గొడవ, అంతస్థులగొడవ నాకు అక్కరలేదు, వారు హృదయంలో ఎలా ఉన్నారు అనేది నాకు ప్రధానం. ఒక మనిషి యొక్క విలువ వాడికి ఉన్న ధనం మీద, చదువు మీద, పదవుల మీద ఆధారపడిలేదు, వాడు హృదయంలో ఎలా ఉన్నాడు అనేది ముఖ్యం. మీరు హృదయంలో కల్మషం పెట్టుకొని పైకి మర్యాద మాటలు మాట్లాడటం వలన ఏమి ప్రయోజనం? దాని వలన భగవంతుడు మోసపోడు. చదువుకోవటం వలన వాడి పొట్ట బాగా వెళ్ళిపోతోంది కాని వాడి స్వభావం రవ్వంత అయినా మారిందా? ఇదీ

రామకృష్ణుడి ప్రశ్న. చదువులు పెరిగేకొలదీ, నాగరికత పెరిగేకొలది మానవతా అనుబంధాలు తగ్గిపోతున్నాయి. ఎప్పుడూ కూడా అనుకరణ పనికిరాదు, మనకాళ్ళమీద మనం నిలబడాలి. ఎవరికో భక్తి లేదు అని మీరు కూడా భక్తి లేకుండా ఉండకండి. భౌతికమైన వాంఛలు ఎక్కువగా ఉన్నవారికి, దేహబుద్ధి ఎక్కువగా ఉన్నవారికి అసలు భగవంతుడనేవాడు ఒకడు ఉన్నాడని కూడా వారికి స్ఫురించదు. వాళ్ళందరూ అలా ఉన్నారు కదా మనం కూడా అలా ఉందాము అని ఎప్పుడూ అనుకోవద్దు. జీవితంలో అనుకరణ పనికిరాదు. సమాజాన్ని, ప్రపంచాన్ని అనుకరించినవాడు ఎవ్వడూ కూడా బ్రాహ్మీస్థితిని పొందలేదు.

ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలనుకొనే వారికి దేని గురించి బెంగ ఉండ కూడదు. ఏ విషయంలోను బెంగ ఉండకూడదు. ఎప్పడో ఎక్కడో పడిపోయాము, గాయం అయ్యింది. గాయం అయ్యింది అని ఏడుస్తూ కూర్చుంటే అది తగ్గుతుందా? మీరు వర్తమాన కాలంలోనికి రావాలి. అది తగ్గే ఉపాయం చూసుకోవాలి, దానికి మందులు వాడాలి. వర్తమానకాలంలో జీవించటం మానేసి, దానికి మందులు వాడటం మానేసి దెబ్బ తగిలింది అని ఏడుస్తూ కూర్చోవటం వివేకవంతమా? దానికి మందులు వాడటం వివేకవంతమా? అది మీరు ఆలోచించుకోండి. భూతకాలం గొడవ వద్దు. భవిష్యత్‌లో గాలిమేడలు కట్టవద్దు. జరిగిపోయిన దాని గురించి ఏడుస్తూ కూర్చోవద్దు. భవిష్యత్‌లో ఏదో జరిగిపోతుంది అని ఊహించుకోవద్దు. దానిలో నుండే భయం పుడుతుంది. ఇతరులు ఉన్న వాడికి భయంకాని, ఇతరులు లేనివాడికి భయం ఏమిటి? నీకు గాఢనిద్రలో భయం ఉందా? గాంధీగారు ఉద్యమం నడిపేటప్పడు ఇంటి దగ్గర చెప్పేవారు నేను సాయంత్రం రావచ్చు, రాకపోవచ్చు. ఒకవేళ నేను చనిపోతే నేను చనిపోయాను అని మీరు ఏడుస్తూ కూర్చోవద్దు, చావులో నుండి ఎలా బయటపడాలో చూసుకోండి అంటే ఈ శరీరం చనిపోతున్నప్పటికీ మనం జీవించి ఉండవచ్చు అనే అనుభవం సంపాదించుకోండి అని చెప్పారు. గాంధీగారి కంటే గొప్పనాయకులు, తెలివైనవారు చాలామంది ఉన్నారు కాని ఆయనకు అంతపేరు రావటానికి కారణం ఏమిటి అంటే మన చేతిలో ఉన్న గడ్డి పరకను వదిలేసినంత తేలికగా అవసరమైతే ఆయన ప్రాణాన్ని వదిలేస్తారు, ఆయన భయరహితుడు, అందుచేత ఆయన గొప్పవాడు అయ్యాడు.

ఏదైనా ఆలోచించేటప్పడు నువ్వు రాగద్వేషములు పెట్టుకొని ఆలోచించవద్దు. వివేకవంతంగా ఆలోచించు. శ్రవణం చేయటం కూడా మీ సాధనలో ఒక భాగం. ఈ

శ్రవణం కూడా సాధనగా ఉపయోగపడితేనే శ్రవణం చేయండి. లేకపోతే ఈ మీటింగులకు రావటం అనవసరం. ఎందుచేతనంటే ఇంటిదగ్గర పనులు ఉంటే చేసుకోవచ్చు. అక్కడా చెడిపోయి, ఇక్కడా చెడిపోయి తిరగటం ఎందుకు? మీరు ఇంటిదగ్గర ప్రశాంతంగా కూర్చోండి. మీకు రాగద్వేషాలు వస్తాయి కదా. ఈ రాగద్వేషాలే మనలను పాడుచేస్తున్నాయి. మీ ఇంట్లోకి పాము వస్తోందనుకోండి. గుమ్మంలోనికి ఎంటర్ అయ్యేటప్పుడు మీరు దానిని చూస్తూ ఉంటే అది కూడా మిమ్మల్ని చూసి వెనక్కి వెళ్లిపోతుంది. అలాగే రాగద్వేషాలు మీ మనస్సులోనికి ప్రవేశించేటప్పుడు వాటిని చూస్తూ ఉంటే అవి మనస్సులో ప్రవేశించవు. అలాగ రాగద్వేషాలు లోపలకు ప్రవేశించకుండా చూసుకోండి, అది సాధనలో ముఖ్యభాగం. రాగద్వేషాలు తగ్గించుకొంటే మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. మనస్సుకు లోచూపు కలుగుతుంది. నీకు రాగం ఉంది, భయం ఉంది, క్రోధం ఉంది. వాటిని పోగొట్టుకోవాలంటే నన్ను ఆశ్రయించండి అని పరమాత్మ చెప్పాడు. శరణాగతి మనకు కుదరాలి కాని జ్ఞానమార్గం కంటే శరణాగతిమార్గం తేలిక. భగవంతుడు ఉన్నాడు, నేను ఉన్నాను అని ఇప్పుడు మనం అనుకొంటున్నాము. నువ్వు శరణాగతిమార్గంలో ప్రయాణం చెయ్యగా చెయ్యగా నేను లేను, వాడే ఉన్నాడు అనే అనుభవం నీకు కలుగుతుంది, అది నీ కడసారి జన్మ. మీరు పరస్పరం నా గురించి మాట్లాడుకొంటూ ఉంటే, నా మీద సజీవమైన విశ్వాసం కలిగి ఉంటే, నన్ను ఆశ్రయిస్తే రాగము, భయము, క్రోధము ఇవి అన్నీ పోతాయి, వాటిని పోగొట్టుకోవటానికి ప్రత్యేకంగా సాధన చేయనక్కరలేదు అని పరమాత్మ చెపుతున్నాడు. భగవదనుభవం పొందటానికి ఏ బలహీనతలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని విచారణ వలన, భక్తి వలన, శరణాగతి వలన నెమ్మదిగా పోగొట్టుకొని పరమపవిత్రులైన వారే నా స్వరూపమును పొందగలరు అంటున్నాడు పరమాత్మ.

నీకంటే భగవంతుడు వేరుగా ఉన్నాడా లేడా అని నువ్వు అనుకొంటున్నావు. ఇప్పుడు అసలు అది ప్రశ్నే కాదు. భగవంతుడి కంటే వేరుగా నువ్వు ఉన్నావా? లేదా? ఇదీ ప్రశ్న. ఈ ప్రశ్నకు సరైన సమాధానం దొరికితే నువ్వు లేవని తెలుస్తుంది. అప్పుడు ఉన్నది ఎవరంటే భగవంతుడే, అదే చైతన్యం. మీ కంటే వేరుగా భగవంతుడు అనేవాడు ఉన్నాడా? లేడా? అని మీరు అందరూ వెతుకుచున్నారు, అలా వెతకటం మానేయండి. భగవంతుడి కంటే మీరు వేరుగా ఉన్నారా అని విచారణ చేయటం ప్రారంభిస్తే మీరు వేరుగా లేరు అన్న సంగతి తెలుస్తుంది. ఉన్నది భగవంతుడే, అది అల్టిమేట్ స్టేట్. అప్పుడు నువ్వు స్వతంత్రమైన సుఖాన్ని,

నిజమైన ఆనందాన్ని పొందుతావు. ఇప్పడు మనం పొందే సుఖాలు అన్నీ ఇంట్లో మనుషుల మీద, వస్తువుల మీద, పరిస్థితుల మీద ఆధారపడి ఉన్నాయి, అవి ఎంతకాలం నిలబడతాయి. మీ కోడలు చాలా మంచిది అని మీరు ఆనందం పొందుతూ ఉంటే అది ఎప్పడైనా ఎదురు తిరిగితే మీ ఆనందం అంతా పోతుంది. ఇలా వ్యక్తుల మీద ఆధారపడిన సుఖాలు, భోగాలు ఎంతసేపు నిలబడతాయి. అసలు సుఖం అనేది, శాంతి అనేది బయటనుండి రాదు, అది లోపల నుండే రావాలి. బయటనుండి వచ్చేది ఏదీ నిలబడదు. సమాధానపరచువారు ధన్యులు వారు దేవుని చూచెదరు. యిద్దరికి పేచీలు వస్తే అది ఎలా పరిష్కారం చేద్దామని కొంతమంది ఆలోచించి దానిని పరిష్కారం చేస్తారు. కొంతమంది అయితే ఎక్కడ చెప్పే మాటలు అక్కడ చెప్పేసి తగువును పెంచేస్తారు. ఇటువంటి వారు దేనికీ పనికిరారు, వారు ఏ నాటికీ పవిత్రులు అవ్వలేరు.

మీరు చేసే పని శ్రద్ధగా చేసుకోండి. వచ్చేది వస్తుంది, రానిది రాదు. మీరు పని బద్ధకస్తులు అవ్వవద్దు. పనిచేసినప్పడు ఎంతోకొంత లాభం రావచ్చు, అక్కడితోటి సంతృప్తి పడు, అతిగా వెళ్ళకు, దురాశకు వెళ్ళకండి. దురాశవల్ల పతనమైపోతారు. తల్లి కడుపులో నుండి వచ్చినది మొదలు స్మశానంకు వెళ్ళేవరకు ఎవడి జీవితం సమానంగా వెళ్ళదు, జీవితంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. ప్రారబ్దాన్ని బట్టి దుఃఖం వస్తుంది, సుఖం వస్తుంది. ఈ ద్వంద్వాలను నువ్వు ఓవర్‌కమ్ చేయాలి. నువ్వు సత్యాన్వేషణలో ఉన్నప్పడు అవి నిన్నేమీ చేయలేవు. దుఃఖం వచ్చినప్పడు ఇలా ఉంటాడు, సుఖం వచ్చినప్పడు ఇలా ఉంటాడు అంటే ఇవి సామాన్యుడి గురించి చెప్పే మాటలు, ఇవన్నీ జీవలక్షణాలు. ఆత్మజ్ఞానికి ఇవి ఏమీ లేవు. జ్ఞానికి సుఖంఏమిటి? దుఃఖం ఏమిటి? లాభం ఏమిటి? నష్టం ఏమిటి? ఈ ద్వంద్వాల గొడవ అక్కడ ఏమీ లేదు. నీ గది లోపల 24 గంటలు దీపం పెట్టేసి ఉంచితే ఆ గదిలోనికి చీకటి వస్తుందా? చీకటిని రా అని పిలిచినా లోపల వెలుతురు ఉండగా చీకటి రాలేదు. అలాగే నువ్వు జ్ఞానామృతంలో ఊగిసలాడుతున్నప్పడు కష్టాలను రా అని పిలిచినా అవి రాలేవు. నీకు జ్ఞానం కలిగినప్పడు నీకు ఏదైనా బాహ్యంగా కష్టం వచ్చినా అది సుఖంగా మారిపోవును. ఒకవేళ బయట చూసేవారికి అది కష్టంగా కనిపించినా, అది నీకు కష్టంగా కనబడదు. నువ్వు నిర్వికారంగా ఉంటావు. ఇప్పడు మీరు అందరూ ఆ స్థితిని పొందాలి. తుకారామ్‌ను చూడండి ఆయనను ఇంట్లోవారు అవమానాలు చేసారు, బయటవారు అవమానాలు చేసారు అయినా నిర్వికారంగా ఉన్నాడు. ఓ పాండురంగా! నీ

దగ్గర ఉన్న కష్టాలు, బాధలు అన్నీ పంపేసావు, జీవితంలో ఎన్ని అవమానాలు పొందాలో అన్నీ పొందాను. ఇంకా నీ దగ్గర ఏమైనా కష్టాలు ఉంటే పంపు, నేను భరించటానికి సిద్ధంగా ఉన్నాను, నీ చేతిలో నేను ఓడిపోలేదు, నా చేతిలో నువ్వే ఓడిపోయావు అన్నాడు తుకారామ్. ఆయనకు వ్యాపారం గురించి తెలియదు, కొంతకాలం వ్యాపారం చేసాడు, అందులో నష్టాలు వస్తే ఇంట్లో వారు ముందు తిట్టేవారు, తరువాత కొట్టేవారు. అయినా ఆయనకు ఎప్పుడూ వికారం రాలేదు. ఇంక అహంకారానికి ఎక్కడ ఉండాలో తెలియక నెమ్మదిగా జారిపోయింది. అది ఎప్పుడు పోయిందో తెలియదు వెదికినా కనబడటం లేదు. వాడు తుకారామ్.

మీరు ఎవరిని చూసి అసూయపడవద్దు. అసూయవల్ల ఏమీ కలిసిరాదు. లోభిత్వంగా ఉండటం వలన ఎంతోకొంత ధనం మిగులుతుంది కాని అసూయ వల్ల మీ మనస్సు కాలిపోవటం తప్పించి ఇంకేమీరాదు. మానవ మనస్తత్వం చాలా విచిత్రం. డబ్బు లేనివారిని చూసి ఆక్షేపిస్తారు, డబ్బు ఉంటే వారిని చూసి అసూయపడతారు. ఎలాగైనా చిక్కే, మానవస్వభావం అంత ఇరుకు. అటువంటి మనుషుల యొక్క మాటలను ప్రమాణంగా తీసుకోవద్దు, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో. అసూయరాకుండా జాగ్రత్తగా కాపలా కాసుకోండి. వారికి ధనం ఎక్కువగా ఉంటే అది వారి ప్రారబ్దాన్నిబట్టి వచ్చింది. మనం గజం నాలుగు రూపాయల బట్టలు కట్టుకుంటే, వారు గజం పది రూపాయలు బట్టలు కట్టుకోవచ్చు, మనం కార్లలో తిరిగితే వారు విమానంలో తిరగవచ్చు. ఇప్పుడు మనకు తిండికి, బట్టకు లోటు లేదు కదా, వారికి ఎక్కువ ఉంది అనే గొడవ మనకు అనవసరం. అసూయ పెట్టుకోవటం వలన శారీరకంగా, మానసికంగా కుళ్ళిపోతారు. అందుచేత అసూయ రాకుండా చూసుకోండి. మీరు అసూయ లేకుండా ఉంటే, రాగద్వేషాలు లేకుండా ఉంటే, మీకు ఉన్న దానితో సంతృప్తి పడుతూ ఉంటే అప్పుడు మీకు సిద్ధి కలిగినా, అసిద్ధి కలిగినా అంటే మీ ప్రయత్నం సఫలం అయినా, సఫలం అవ్వకపోయినా మీ మనస్సు సమానంగా ఉంటుంది. మీరు వికారాలకు దూరంగా ఉండి పనిచేస్తూ ఉంటే అప్పుడు పని మిమ్మల్ని బంధించదు.

సర్వభూతహితేరతాః, ఇది మంత్రం. అందరి హితవు కోరుకోండి అంటే అందరి క్షేమం కోరుకోండి. ఇది భగవాన్ ఉవాచ. ఎవరికీ దుఃఖం రావాలని, బాధలు రావాలని కోరుకోవద్దు. జంతుజాలం కూడా దుఃఖపడాలని కోరుకోవద్దు. ఇంటిలో దారిద్ర్యం ఉన్నా భావనలో దారిద్ర్యం ఉండకూడదు. వారు ఎటువంటివారు అనేది మనకు అనవసరం, మీరు అందరి క్షేమాన్ని కోరుకోండి. ఎవరైనా శాంతిగా ఉంటే, సంతోషంగా ఉంటే వారిని

చూసి మీరు కూడా సంతోషంగా ఉండటం నేర్చుకోండి. హృదయంలో ఉన్న సత్యాన్ని డైరెక్టుగా దర్శించిన వారిని ఋషులు అంటారు అంటే సత్యసాక్షాత్కారం పొందినవాడిని ఋషి అంటారు. నీకు ధ్యానబలం ఉంటే అది సాధ్యమే. మీలో ఏ బలహీనతలు ఉన్నాయో, ఏ లోపాలు ఉన్నాయో చూసుకోండి. మాకు ఆ లోపం ఉంది, ఈ లోపం ఉంది అని ఆ లోపాలను చూసి ఏడవకండి. వాటిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయండి, అదే సాధన. మా మనస్సులో కల్మషం ఉంది అని ఏడుస్తూ కూర్చోవద్దు, ఆ కల్మషాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. కంటిలో నలుసు ఎంతబాధపెడుతుందో, కాలిలో ముల్లుఎంత బాధపెడుతుందో సందేహాలు కూడా అంతే బాధపెడతాయి. అందుచేత సందేహాలు పెట్టుకోవద్దు. మీకు సందేహాలు ఉంటే గురువును అడిగి, లేక శాస్త్రాన్ని చూసి ఆ సందేహాలను తొలగించుకోండి. భగవంతుడు అనేవాడు ఉన్నాడని మీకు సజీవమైన విశ్వాసం కుదరాలి. కొంతమందికి ఏరోజుకారోజే అనుమానం. ఇక్కడ మేము చెపుతూ ఉంటే విన్నప్పుడు భగవంతుడు ఉన్నాడు అనిపిస్తుంది. ఆ రోడ్డు మీదకు వెళ్ళాక లేడేమో అనిపిస్తుంది. ఎందుచేతనంటే మీ స్వభావం ఎక్కడికి పోతుంది. వినటం తేలికగానే వింటున్నారు కాని స్వభావం అంత తేలికగా పోతుందా? మీ మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. మీ మనస్సు, ఇంద్రియాలు ఎక్కడ వాలుతున్నాయో పరిశీలనగా చూసుకొని అక్కడనుండి వాటిని విత్‌డ్రా చెయ్యాలి. మీకు ఏదైనా కోరిక వచ్చింది అనుకోండి ఆ కోరికను సాటిస్‌ఫై చేయటంకంటే దానిని కంట్రోలు చేయటం వలన నీకు ఎక్కువ ఆనందం వస్తుంది.

మీరు ఒక ఇంద్రియంతో ఏదో విషయాన్ని ఎంజాయ్ చేస్తారు. ఆ సంతోషాన్ని అనుభవించినప్పుడు అది వాసనకింద పడుతుంది. వాసనలోనుండి తలంపు వస్తుంది, అందులోనుండి కోరిక వస్తుంది, ఆ కోరికను సాటిస్‌ఫై చేయటానికి ప్రయత్నం చేస్తాము. అది సాటిస్‌ఫై అయ్యాక మరల అది వాసన కింద పడుతుంది. తలంపును బట్టి పనిచేస్తారు, తలంపును బట్టి మాట్లాడతారు. అందుచేత మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో జాగ్రత్తగా చూసుకోవాలి. మనకు చెడుతలంపులు వస్తే అవి దేహబుద్ధిని పెంచేస్తాయి, లోక వాసన పెంచేస్తాయి. ఈ దేహం ఒక్కటే నిజం, ఈ లోకం ఒక్కటే నిజం, మరణానంతర జీవితం లేదు అని మనకు అనిపిస్తుంది. అంటే చెడుతలంపులు ఏమి చేస్తాయి అంటే నిజంకానిది నిజం అనే భావనను బలపరుస్తాయి. మంచితలంపులు ఏమి చేస్తాయి అంటే మీకు దేహబుద్ధిని, లోకవాసనను తగ్గించి భగవంతుని పాదాలను చేరుకోవటానికి మంచి

తలంపులు సహకరిస్తాయి. మీరు చేసే స్నేహాల విషయంలో, చదివే పుస్తకాలు విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. ఇతరుల మాటలు విని మనం మోసపోతే అది పూర్తిగా వాడి తప్పకాదు, మన తప్పకూడా కొంత ఉంది. ఎందుచేతనంటే ఆ మాటలను అర్థం చేసుకొనే శక్తి మనకు లేదు. మనకు అవగాహన లోపం ఉంది కాబట్టి మనదీ తప్ప ఉంది. మనిషి వివేకవంతంగా జీవించాలి. వివేకం అంటే అక్కడ తెలివితేటలు అని కాదు, ఏది మనకు ఉపయోగపడుతుంది, ఏది ఉపయోగపడదు అని విడదీసుకునే శక్తి మనకు ఉండాలి. ఏది సత్యం ఏది అసత్యం, ఏది నిత్యం ఏది అనిత్యం, ఏది బంధంలోనుండి మనలను విడుదల చేస్తుంది ఏది బంధాన్ని పెంచుతుంది అని విడదీసుకునే శక్తి మనకు ఉండాలి.

కామక్రోధాలు అన్నా రాగద్వేషాలు అన్నా ఒక్కటే. ఇవన్నీ మాటల గారడీ. ఎక్కడైతే కామం ఉందో అక్కడ రాగం ఉంటుంది, ఎక్కడైతే క్రోధం ఉందో అక్కడ ద్వేషం ఉంటుంది. మీరు ఇంటికి వెళ్ళి పరిశీలన చేసుకోండి. మీకు ఎవరిమీద అయితే ఇష్టం ఉందో అక్కడ కామం వస్తుంది, కామం అంటే కేవలం శరీర సంబంధంకాదు మీకు ఎవరినైనా చూడగానే కోపం వస్తూ ఉంటే ఆ మనిషిమీద మీకు ద్వేషం ఉందని గుర్తు. ఈ కామక్రోధములనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయండి. మీరు ప్రయత్నం చేసుకోండి, నేను సహాయం చేస్తాను అనేవాడు రామకృష్ణుడు. నువ్వు నా దగ్గరకు వస్తున్నావు కదా, నీకు ఏదో ఉపకారం ఉండాలికదా. నీలో ఉన్న బలహీనతలను లాగేస్తాను అనేవాడు. దూడపుట్టగానే ఆవు ఆ దూడను ఎలా నాకుతుందో అలాగ మీరందరూ నా పిల్లలే, మీలో ఉన్న వాసనలను నాకేస్తాను అనేవాడు. రామకృష్ణుడు నిందాస్తుతులకు అతీతుడు. రామకృష్ణుడి దూరపు బంధువు అతని పేరు హృదయ్, ఈయన దగ్గర కొంతకాలం ఉండి తరువాత ఈయన మీద కోపం వచ్చి, రామకృష్ణుడిని తిట్టేసి అక్కడినుండి వెళ్ళిపోయాడు. తరువాత ఆయన చాలా బాధలు, కష్టాలు పడి తిరిగి రామకృష్ణుడి దగ్గరకు రావటానికి సిగ్గుపడి చివరకు మహేంద్రనాథ్‌గుప్తాను తీసుకొని రామకృష్ణుడి దగ్గరకు వెళ్ళి ఏడుస్తాడు. వాడు ఏడుస్తూ ఉంటే రామకృష్ణుడు కూడా ఏడ్చాడు. తరువాత మహేంద్రనాథ్‌గుప్తా రామకృష్ణుడిని అడుగుతాడు. వాడు ఏడిస్తే ఏడుస్తాడు, మీరు ఏడుస్తున్నారు ఏమిటి? వాడు మన శత్రువు మనలను తిట్టి వెళ్ళిపోయాడు కదా వాడి గురించి మీరు ఏడవటం ఏమిటి అన్నాడు. శత్రువు ఏమిటి మనకు విరోధులని, స్నేహితులని, బంధువులని ఉన్నారా? ద్వైతం ఉందా మనకి? వాడు మనకు కొన్నాళ్ళు సేవ చేసాడు, తరువాత తిట్టాడు, వాడు చేసిన చెడ్డ జ్ఞాపకం

పెట్టుకోవద్దు, వాడు చేసిన మంచే జ్ఞాపకం పెట్టుకొందాం అన్నారు.

మన బంధానికి మనస్సే కారణం, మోక్షానికి మనస్సే కారణం. మరణానంతరం మన కూడా వచ్చేది మనస్సే. ఇంక ఎవరూ రారు. నీ శరీరమే నీకూడా రానప్పుడు ఈ శరీరంతో సంపాదించింది నీ కూడా ఎలా వస్తుంది? శరీరానికి సంబంధించిన బంధువులుగాని, విరోధులుగాని, స్నేహితులుగాని ఎవరూ నీకూడా రారు. మరణానంతరం నువ్వు ఒంటరిగా ప్రయాణం చేయవలసిందే. మనస్సే మన కూడా వస్తుంది. మరణానంతరం నీకూడా వచ్చే మనస్సును బాగుచేసుకోవటానికి నువ్వు ప్రయత్నం చేయటం లేదు. మనకు జ్ఞానం రావాలి అంటే మన ఇంద్రియాలు, మనస్సు మనకు సహకరించాలి. ఇంద్రియాలు, మనస్సు సహకరించకుండా ఎవడికీ ఆత్మానుభవం కలుగదు. ఇంద్రియాలు, మనస్సు ఎవడికైతే స్వాధీనంలో ఉన్నాయో వాడు మాత్రమే సత్యాన్వేషణ చేయగలడు. ఇవ్వటంలో ఉన్న శాంతి, ఇవ్వటంలో ఉన్న సంతోషం సంపాదనలో ఉండదు. గివింగ్, టేకింగ్ అనే మాటలు వదిలేద్దాము. మీరు షేరింగ్ అనే మాటను ఉపయోగించండి. గివింగ్ అనే మాట ఉద్రేకపరుస్తుంది, షేరింగ్ ఉద్రేకపరచదు. డబ్బు అంటే ఇష్టం ఉన్నవారు ఆ డబ్బు సంపాదించుకోవటానికి ఎంత శ్రద్ధగా ప్రయత్నం చేస్తారో, చదువు అంటే ఇష్టం ఉన్నవారు కష్టపడి ఎంత శ్రద్ధగా చదువుకుంటారో, నువ్వు మనస్సును నిగ్రహించుకోవటానికి అంత శ్రద్ధగా ప్రయత్నం చేస్తే మనోనిగ్రహం వస్తుంది. ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోనికి వస్తాయి. నీ మనస్సును నువ్వు స్నేహితుడిగా చేసుకో, విరోధిగా చేసుకోవద్దు. నీ ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోనికి వస్తే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి, విచారణ చేయండి, భగవంతుడి మీద విశ్వాసం పెంచుకోండి, గురువును ఆశ్రయించండి. ఇలా అన్ని విధములుగా ప్రయత్నం చేసి మీ మనస్సును స్వాధీనం చేసుకోండి.

రామకృష్ణపరమహంసగారు భగవంతుడిని అమ్మరూపంలో ఆరాధించారు, కొంతమంది తండ్రి రూపంలో ప్రార్థిస్తారు. ఏదో ఒకటి మొత్తం మీద ఉపాసన ఉండాలి, ఉపాసన లేకపోతే మోక్షం రాదు. నువ్వు బ్రాహ్మీస్థితి పొందాలి అంటే నీ మనస్సు దానికి ఫిట్ అవ్వాలి. అందుచేత మనస్సుకు అర్హతను, యోగ్యతను పట్టించాలి. మనకు ఎంతవరకు అర్హత ఉందో, యోగ్యత ఉందో అంతవరకే అభివృద్ధి చెందుతాము కాని మన కోరికను బట్టి ఏదీ రాదు. మనస్సు ఈ దేహంమీద, లోకంమీద ఎక్కువగా వాలకుండా చూసుకోవాలి.

దేహంతోటి, లోకంతోటి తాదాత్మ్యం పొందే బదులు లోపల ఉన్న చైతన్యంతోటి తాదాత్మ్యం పొందితే ఇంక మనస్సు బయట వాలటం మానేస్తుంది. హృదయవాసి అయినటువంటి ఈశ్వరుడితో సంబంధం తెగిపోయిందా సడన్‌గా మనస్సు వెళ్ళి దేహంమీదో, లోకంమీదో ఎక్కడో పడిపోతుంది, ఇంక ఆ అడవిలోనుండి బయటకు రాలేము, మనకు దారి కనబడదు. అసలు మాయ అనే వలలో పడకూడదు కాని పడితే అందులోనుండి బయటకు రావడం చాలా కష్టం. నా అనుగ్రహం లేకుండా అందులోనుండి బయటకు రాలేరు అని పరమాత్మ చెప్పాడు. అందుచేత మీ ప్రయత్నంతోపాటు, సాధనతోపాటు దైవానుగ్రహం ఉండాలి. ఈ రెండు కలిసివస్తేనే మీరు సక్సెస్ అవుతారు గాని లేకపోతే మీరు సక్సెస్ అయ్యే అవకాశం లేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 31-10-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వివేకానంద 1863 సంవత్సరం జనవరి 12వ తేదీన కలకత్తాలో జన్మించాడు. బాపూజీని ఫాదర్ ఆఫ్ ద నేషన్ అంటారు. వివేకానందను మేకర్ ఆఫ్ మోడరన్ ఇండియా అంటారు. ఆయనకు భారతదేశం అంటే చాలా ఇష్టం, మా తల్లి దేశం కదా అనేవాడు. నరేంద్రునికి తల్లితండ్రులు పెట్టినపేరు వీరేశ్వరుడు. వివేకానందుడిని నరేన్ అని పిలుస్తారు. నరేన్ అంటే నరులలో శ్రేష్ఠుడు. ఆయన శివుడియొక్క అంశ, రామకృష్ణుడిని కేశవుడి యొక్క అంశ అంటారు. అంటే శివకేశవులు. వివేకానంద జయంతిని నేషనల్ యూత్ డే అంటారు. నరేంద్రుడు యువకుల్ని ఎక్కువగా ఆకర్షించాడు కాబట్టి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జనవరి 12వ తేదీని నేషనల్ యూత్ డేగా ప్రకటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ వివేకానంద గురించి ఒక మాట చెప్పాడు, ఇది బాగా గుర్తుపెట్టుకోండి. ఇన్ స్వామి వివేకానంద ఎవ్విరితింగ్ ఈజ్ పాజిటివ్. నీకు 30 మార్కులు వస్తూ ఉంటే నువ్వు ఎందుకూ పనికిరావు అని ఎవడితోను చెప్పడు, నువ్వు 40 మార్కులు తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి, నువ్వు పెద్దవాడవు అవ్వాలి, ఈ దేశానికి ఉపయోగపడాలి. నిన్ను నువ్వు బాగుచేసుకోకుండా దేశానికి ఎలా ఉపయోగపడతావు అని చెపుతాడు. నీ దగ్గర ఏదైనా ఉంటే అది ఇతరులకు ఇవ్వగలవు, నీ దగ్గర ఏమీ లేకపోతే ఇంక ఇతరులకు ఏమి ఇస్తావు. సమ్‌థింగ్‌లోనుండి ఏదైనా వస్తుంది కాని నథింగ్‌లోనుండి ఏమి వస్తుంది.

వివేకానంద చెప్పినదంతా సత్యం అని తరువాత చర్చిల్ కూడా చెప్పాడు. ఎవరి

దగ్గర అయినా డబ్బు లేకపోతే వారిని న్యూనతగా చూడటం, డబ్బు ఉన్నవారిని చూసి అసూయ పడటం, అది నేషనల్ సిన్. ఇండియాలో ఈ జబ్బు చాలా ఎక్కువగా ఉంది. ఎవడైనా అభివృద్ధిలోనికి వస్తూ ఉంటే వాడి రెండు కాళ్ళు పట్టుకొని కిందికి లాగేస్తారు. అసలు వాడిని పైకి రానివ్వరు. అందుచేత ఇక్కడ ప్రజలను పీతల మంగళం అంటారు. అంటే మనం పదిపీతలను తీసుకొని ఒక డబ్బాలో వేస్తే అందులో ఒక పీత పైకి రావటానికి ప్రయత్నం చేస్తోంది అనుకోండి మిగిలిన పీతలు దానిని పట్టుకొని కిందకు లాగేస్తాయి.

భారతదేశంలో ఉన్న రాజకీయ నాయకులలో రాజేంద్రప్రసాద్, సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంటే నాకు చాలా ఇష్టం. వారిద్దరూ కూడా చాలా తక్కువగా మాట్లాడతారు కాని ఎక్కువ పనిచేస్తారు. ఇద్దరూ కూడా భక్తులే. రాజేంద్రప్రసాద్‌కు భక్తి ఉన్నట్లు మనకు తెలుస్తుంది, పటేల్‌కు భక్తి ఉన్నట్లు మనకు తెలియదు, హృదయాంతరాళాలలో ఆయన భక్తుడే. గుజరాత్‌లో సోమనాథ్ దేవాలయం ఉండేది. అప్పటి యుద్ధాలలో దానిని పాడుచేసారు. స్వరాజ్యం వచ్చాక పటేల్ ప్రజలనుండి చందాలు వసూలు చేసి ఆ సోమనాథ్ దేవాలయాన్ని బాగు చేయించాడు. స్వాతంత్ర్య సమరంలో వారు చాలా ప్రాక్టికల్‌గా పనిచేసారు, దేశానికి చాలా సేవ చేసారు. బుద్ధుడు, ఏసు, రామకృష్ణుడు వీరు ఎప్పుడూ వారి గురించి వారు ఆలోచించుకోలేదు అంటే వాళ్ళ గురించి వాళ్ళకు ఎప్పుడూ ఒక తలంపు కూడా రాలేదు. ఇప్పుడు మన గురించి మనం 24 గంటలు ఆలోచించుకోవటం తప్ప మనకు రెండో పని లేదు.

పూర్వం రామానుజుడు, శంకరుడు, మధ్వుడు, తిలక్‌గారు భగవద్గీతకు, ఉపనిషత్‌లకు వ్యాఖ్యలను వ్రాసారు మరి స్వామీజీ వ్రాయలేదు ఏమిటి అని ఈ మధ్యనన్ను తిరువణ్ణామలైలో ఎవరో అడిగారు. స్వామీజీ వచ్చిన పని వేరు. కొన్ని వందల సంవత్సరాల నుండి నిద్రపోతున్న భారతజాతిని మేల్కొలపడానికి ఆయన వచ్చాడు. ఇక్కడ మనలో మనం కొట్టుకొంటున్నాము. ఇతర దేశాలు ఎలా అభివృద్ధిలోనికి వస్తున్నాయో అలాగ మనం కూడా అభివృద్ధిలోకి రావాలి. ఇంగ్లీషు వారి దగ్గర మనం బానిసలుగా బతుకుతున్నాము. ఆ బానిసత్వంలో నుండి ముందు బయటకు రావాలి అని చెప్పాడు. ఆపని చేయటానికే ఆయన వచ్చాడు అది చేసాడు. ఆయన సనాతనధర్మం గురించి కూడా చెప్పాడు, ఉపనిషత్‌లను, భగవద్గీతను కోడ్ చేసాడు. ఈమధ్య హైదరాబాద్‌లో రామకృష్ణమఠానికి వెళ్ళాను అక్కడ ఒక స్వామి చెపుతున్నారు. ఆయన చెప్పేది ఏమిటి అంటే భగవద్గీత కూడా సైన్స్‌తో సమానం అని చెప్పటానికి ప్రయత్నం చేస్తున్నారు. సైన్స్ అనేది బ్రెయిన్‌చైల్డ్ అంటే సైన్స్ మన మెదడులో నుండి

వచ్చింది. మన మెదడు ఎంత నిజమో అది కూడా అంతే నిజం. కాని భగవద్గీత ఎవరు చెప్పారు. చైతన్యం చెప్పింది, పరమాత్మ చెప్పాడు. చెప్పటానికి ఒక రూపం ఉండాలి కాబట్టి చైతన్యమే కృష్ణుడిరూపం ధరించి చెప్పింది. భగవద్గీతను తీసుకొని వెళ్ళి సైన్స్‌తో సమానం అని చెప్పటం అది అపచారం. అలా చెప్పటం వలన భగవద్గీతకు గౌరవం పెరుగుతుంది అని ఆయన ఉద్దేశం. దానివలన భగవద్గీతకు గౌరవం పెరగదు, ఉన్న గౌరవం పోతుంది. సైన్స్‌లో చూడండి ఈరోజు ఒక విషయం కనిపెడతారు కొంతకాలం తరువాత అది తప్పు అని చెపుతారు. పరమాత్మ గీతలో ఈ శ్లోకంలో తప్పుచెప్పాడు అని ఇంకో వెయ్యి సంవత్సరాల తరువాత కూడా మనం ఎవరము భగవద్గీతలో శ్లోకాలను అటు ఇటు కదపలేము ఎందుచేతనంటే అది ఎవరో ఒక వ్యక్తి చెప్పింది కాదు, పరమాత్మ చెప్పాడు.

టాక్స్‌విత్ రమణమహర్షి, గోస్పల్ ఆఫ్ శ్రీరామకృష్ణ ఈరెండు పుస్తకాలు మీరు బాగా చదవాలి. మునగాల వెంకట్రామయ్యగారు ఎందుకుపుట్టారు అంటే రమణమహర్షిగారు చెప్పిన మాటలు వ్రాయటానికి పుట్టారు. మహేంద్రనాథ్‌గుప్తా ఎందుకు పుట్టాడు అంటే రామకృష్ణుడు చెప్పిన మాటలు వ్రాయటానికి పుట్టాడు. ఈ పుస్తకాలు అందరూ చదవాలి. నేను హిందువునే కాని నేను గాఢంగా ప్రేమించే వ్యక్తులలో బుద్ధుడు ఒకడు అని స్వామీజీ చెప్పారు. భగవంతుడి గురించి అడిగితే బుద్ధుడు మౌనం వహించేవాడు, ఆయన భగవంతుడి గురించి ఎందుకు చెప్పలేదు అని స్వామీజీని అడిగారు. భగవంతుడు ఉన్నాడని, లేడని ఆయన ఏమి చెపుతాడు, ఆయనే భగవంతుడు అన్నారు స్వామీజీ. ఎంత వండర్‌ఫుల్ రిప్లై చూడండి. మీరు ప్రక్కింటి వారికి డబ్బు ఇవ్వనక్కరలేదు, ఆస్తులు ఇవ్వనక్కరలేదు, పిడకలు ఇస్తే చాలు. నేను వారికి పిడకలు ఇచ్చాను అని జీవితం పొడుగునా జ్ఞాపకం ఉంచుకొంటారు. ఇంక మనకు అదే పని. మన గురించి మనం ఆలోచించుకోవటమే పని. బుద్ధుడు రాజ్యాన్ని విడిచిపెట్టాక, నేను రాజ్యాన్ని విడిచిపెట్టాను అనే తలంపు కూడా ఆయనకు ఎప్పడూ రాలేదట, వాడు బుద్ధుడు అని స్వామీజీ చెప్పారు. కాశీ గురించి రామకృష్ణుడు ఏమన్నాడు అంటే కాశీ పుణ్యక్షేత్రమే, కాశీలో మరణిస్తే ముక్తి వస్తున్న మాట నిజమే కాని నేను ముక్తిని కోరుకోవటంలేదు, నాకు భక్తే చాలు అన్నాడు. వాడు రామకృష్ణుడు.

హ్యూమన్ ఎఫెక్షన్ ఎలా ఉంటుందో మనం రామకృష్ణుడిలో చూడాలి. నరేంద్రుడు కొంతకాలం ఇంటిదగ్గర చాలా కష్టాలు పడ్డాడు. నరేంద్రుడు రామకృష్ణుడి దగ్గర కూర్చొన్నప్పడు అక్కడకు ఒక ధనవంతుడు వచ్చాడు. అప్పడు రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నరేంద్రుడు

కొంచెం ఇబ్బందులలో ఉన్నాడు ఎవరైనా సహాయం చేస్తే మంచిదేమో అంటాడు. వారు వెళ్ళిపోయాక నరేంద్రుడు రామకృష్ణుడిని పట్టుకొని తిడతాడు. నరేంద్రుడు ఇబ్బందిపడు తున్నాడు, మీరు సహాయం చెయ్యండి, డబ్బులు ఇవ్వండి అని ఇలా అడగటం బాగాలేదు, ఇది తప్పు అని రామకృష్ణుడితో అంటాడు. ఎవరిని అడగవద్దు అంటున్నావు, నేను ఎవరినీ అడగను, నీకోసం నేను ముష్టి ఎత్తుతాను అంటాడు రామకృష్ణుడు, "ఐవిల్ బెగ్ ఫర్ యు" అంటాడు. ఇలా ఎవరినీ అడగవద్దు అంటున్నావు, దక్షిణేశ్వరంలో ఉన్న కాళీమాతను అడిగిరా, అమ్మను అడిగిరా అంటాడు రామకృష్ణుడు. నాకు ధనరాశులు అక్కరలేదు, అన్నవస్త్రాలకు లోటులేకుండా చూడు అని అమ్మని అడిగిరా అని రామకృష్ణుడు చెప్పాడు. నేను చెప్పింది అడిగావా అని తరువాత నరేంద్రుడిని అడిగేవాడు. మీరు అడగమన్న మాట నిజమే. కాని అమ్మ యొక్క వైభవం చూస్తూ ఉంటే మీరు అడగమన్న ప్రశ్నలు అన్నీ మర్చిపోతున్నాను. నాకు భక్తిని ప్రసాదించు, జ్ఞానాన్ని ప్రసాదించు అని అడుగుతున్నాను. మీరు చెప్పింది అడగలేదు అనేవాడు. భగవంతుడు కనిపిస్తే నాకు అన్నం లేదు అన్నంపెట్టు, బట్టలులేవు బట్టలు పెట్టు అని అడుగుతామా? భగవంతుడు కనిపిస్తే మోక్షం ప్రసాదించు అని అడగాలి కాని చీపురు కట్ట కావాలి అని అడుగుతామా అనేవాడు.

తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఈ మూడు గుణాలలో మాయ అంతా ఉంది. ఈ మూడు గుణాల నుండి మనం బయటకు రావాలి. ఎవడైతే ఈ మూడు గుణాల నుండి బయటకు వస్తాడో వాడికి మాయ దారి ఇస్తుంది అని పరమాత్మ చెప్పాడు. తమోగుణం ఉన్న వాడికి తిండి, నిద్ర తప్ప ఇంకో గొడవ ఉండదు. వాడికి అసలు పని ఉండదు, తీరుబడి ఉండదు. పని చేస్తున్నాడా అంటే పని చెయ్యడు, పోనీవాడు ఖాళీగా ఉన్నాడా అంటే ఖాళీ ఉండదు. కంచానికి సరిపడ తినేస్తాడు, మంచానికి సరిపడ పడుకొంటాడు. వాడు కుటుంబానికి పనికిరాడు, సమాజానికి పనికిరాడు. రజోగుణం ఉన్నవాడికి ప్రాపంచిక పిచ్చ ఎక్కువగా ఉంటుంది. ధనవంతుడిని ఎవడినైనా మీరు ధనవంతుడు అనండి, వాడు సంతోషిస్తాడు అంటే లోపల రజోగుణం సంతోషిస్తుంది. రజోగుణం ఉన్నవాడికి యాక్షన్ ఎక్కువగా ఉంటుంది. రజోగుణం ఉన్నవాడు ప్రపంచంలో ఏదో సాధించాలని, పేరు తెచ్చుకోవాలని ఇటువంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. సమాజానికి ఉపయోగపడినా, ఉపయోగపడకపోయినా ఏదో కొంత ఆస్థి సంపాదించుకొంటాడు. మీకు ఎంత ఆస్థి ఉంది అని మనం అడగకపోయినా వాడే చెప్పేస్తూ ఉంటాడు. వాడి మనస్సు ఎప్పుడూ ఈ

ప్రాపంచిక సంబంధమైన విషయాలచుట్టూ తిరుగుతూ ఉంటుంది కాని భగవంతుడి మీద వాడి మనస్సు వాలదు. ఇవన్నీ రజోగుణలక్షణాలు. ఈ రజోగుణం నుండి, తమోగుణం నుండి బయటకు వస్తే సత్వగుణంలోనికి వెళతాము. సత్వగుణం ఉన్నవాడు కూడా పనిచేస్తాడు, వాడు క్వయిట్‌గా, కూల్‌గా పనిచేస్తాడు. సత్వగుణం భగవంతుడితో అనుబంధం పెంచుతుంది, మోక్షానికి మార్గం చూపిస్తుంది. జననమరణ చక్రంలో నుండి బయటకు రావాలి అంటే ఈ మూడు గుణాలను దాటాలి. ముందు తమోగుణం, రజోగుణం దాటి సత్వగుణంలో స్థిరపడితే అప్పుడు నీకు శుద్ధసత్వం వస్తుంది, అప్పుడు మాయ నీకు దారి ఇస్తుంది. అందుచేత మీరు జపం చేయండి, ధ్యానం చేయండి, విచారణ చేయండి. భక్తి మార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఏదో ఒకమార్గంలో ప్రయాణం చేయండి. మీ గమ్యం ఏమిటి అంటే ఈ మూడు గుణాలను దాటాలి. ఈ మూడు గుణాలను దాటితేగాని గుణాతీతుడు అవ్వలేడు, గుణాతీతుడు కానివాడు జీవన్ముక్తుడు అవ్వలేడు, భగవంతుడిలో ఐక్యం అవ్వలేడు.

పాండిత్యం, అనుష్టానం, అనుగ్రహం. పాండిత్యం అందరికీ ఉండదు, కొంతమందికి మాత్రమే పాండిత్యం ఉంటుంది. రామకృష్ణుడు, రమణమహర్షి గారికి పాండిత్యం ఏముంది? పాండిత్యం ఉన్నా లేకపోయినా ఫరవాలేదు, అనుష్టానం అంటే ప్రాక్టీసు చెయ్యాలి. అనుష్టానం చెయ్యగా చెయ్యగా గోవిందుడి అనుగ్రహాన్ని పొందుతావు. అనుగ్రహం లేకుండా నువ్వు మోక్షాన్ని పొందలేవు. ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత అనుష్టానం ఉన్నా నీకు అనుగ్రహం రావాలి. నీకు పాండిత్యం ఉంది అనుకో, రోజూ బాగా ధ్యానం చేసుకొంటున్నావు అనుకో, అనుగ్రహం రాకపోతే నీకు మోక్షం రాదు. అనుగ్రహం చాలా ముఖ్యం. అనుగ్రహం వల్లకాని నువ్వు సత్యానుభవం పొందలేవు. సత్యానుభవం పొందకపోతే నీకు స్వేచ్ఛ లేదు, స్వాతంత్ర్యం లేదు. అందుచేత మనం సాధన చేసి ఈ మూడు గుణాలను దాటాలి. అదే మన జీవిత గమ్యం. ఈ మూడు గుణాలను దాటితే అప్పుడు మనకు దేవుని అనుగ్రహం వస్తుంది. దేవుని అనుగ్రహం వలన మాత్రమే ఆయన స్వరూపాన్ని పొందగలము అంటే బ్రహ్మంతో ఏకమౌతాము, అదే ఫైనల్.

స్వామి వివేకానంద 150వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అంతా రథం తిప్పుతున్నారు. ఇలా రథం ఎందుకు తిప్పుతున్నారు అంటే ఏదో పబ్లిసిటీకోసం కాదు, నోట్లకోసం కాదు, ఓట్లకోసం కాదు. మరి ఎందుకు తిప్పుతున్నారు అంటే ఒకసారి ఆయన పేరు వినటం

వలన, ఆయనను స్మరించుకోవటం వలన మనకు యిన్స్పిరేషన్ వస్తుంది. ఆయన పనికి ఎక్కువ ప్రాయుఖ్యత ఇచ్చేవాడు. ఎంతసేపు వర్క్, వర్క్, వర్క్. అంటే మనం చేసే వర్క్ కాదు సెల్ఫ్లెస్ వర్క్కు ప్రాధాన్యత ఇచ్చాడు. ఎవరైనా సోమరితనంగా ఉంటే మందలించేవాడు. అయామ్ టైర్డ్ అనుకొనేవాడు కాని పని మానేసేవాడు కాదు. ఆయన రోజుకు నాలుగు గంటలే నిద్రపోయేవాడు. ఆయనలాగ మనం కూడ సెల్ఫ్లెస్ వర్కు చేస్తే భగవదనుభవం పొందవచ్చు.

స్వామీజీ గురించి మేము ఏమి చెప్పగలము, మాంక్స అయితే కొంతవరకు చెప్పగలరు. స్వామీజీ శరీరం విడిచిపెట్టేరోజున ఇంకో మాంకుతో కలిసి గంగానది దగ్గర తిరుగుతూ వివేకానందుడు ఈ భూమి మీదకు వచ్చి ఏమి చేసాడు అని ప్రక్కన ఉన్న మాంకును అడిగాడు. ఆయన మౌనంగా ఉన్నాడు. అప్పుడు స్వామీజీయే సమాధానం కూడా చెప్పారు. వివేకానంద ఈ భూమిమీదకు వచ్చి ఏమి చేసాడో ఇంకో వివేకానందకి కాని తెలియదు అని చెప్పారు. మరి ఆయన గురించి మనం ఏమి చెప్పగలము. మద్రాసులో పార్ధసారధి కోవెల ఉంది. అక్కడకు వివేకానంద వచ్చారు. ఆయన చెప్పిన మాట అక్కడ గోడ మీద వ్రాసి ఉంది. ఆయన ఏమని చెప్పాడంటే మనం వాసుదేవుడికి శరణాగతి చెందితే ఆయన ఒక్క పార్ధుడికే సారధిగా ఉండడు, మీ జీవితంలో మీకు కూడా సారధిగా ఉంటాడు అంటే అక్కడ నుండి మీకు గైడెన్స్ వస్తుంది అని చెప్పాడు.

వివేకానంద భారతదేశానికి చేసిన సేవ ఏమిటంటే ఆయన చాలామంది పేట్రియాట్స్ని తయారుచేసాడు. గాంధీగారు ఒకసారి బేలూర్ మఠ్లో మాట్లాడుతూ ఏమని చెప్పారు అంటే నాకు ఎంతో కొంత పేట్రియాటిజమ్ ఉంది. వివేకానంద స్పీచెస్ చదివాక నాకు ఉన్న పేట్రియాటిజమ్ రెట్టింపు అయ్యింది అని చెప్పాడు. లెటర్స్ ఆఫ్ స్వామీ వివేకానంద, స్పీచెస్ ఫ్రమ్ కొలంబో టు ఆల్మోరా ఈ రెండు పుస్తకాలు చదివితే ఆయనకు ఉన్న దేశభక్తి గురించి, దేశం గురించి ఆయన పడే ఆవేదన మనకు తెలుస్తుంది. ఒక్క మాటలో ఆయన గురించి చెప్పాలి అంటే ఆయన ఎముకల్ని బజారులో అమ్మి దేశానికి ఉపయోగపడాలి అనేటటువంటి మహాత్ముడు. ఎక్కడైనా కరువు వస్తే, తిండి లేకుండా బాధ పడుతూ ఉంటే అక్కడ ఉన్న మాంక్సతో అనేవాడు ఎందుకయ్యా! ఈ బేలూర్ మఠ్ గ్రౌండుకూడా అమ్మేసి సఫరింగ్లో ఉన్న ప్రజలకు ఇచ్చేద్దాము అని చెప్పేవాడు. ఆయనకు ఉన్న త్యాగబుద్ధి అటువంటిది. త్యాగి కానివాడు యోగి కాలేడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబర్ | 13 | గొరగనమూడి |
| డిసెంబర్ | 23 | హైదరాబాద్, గీతాజయంతి, శ్రీనివాస కాలనీ, కమ్యూనిటీ హాల్, వెంగళరావునగర్ |
| డిసెంబర్ | 29 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం, భగవాన్ జయంతి |
| జనవరి | 7 | మురమళ్ళ |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# శ్రీ రమణ గురువు

బ్రహ్మమే ఒక దేహాన్నిధరించి, దివి నుండి భువికి గురురూపంలో దిగివచ్చుట, అరుదుగానే లభిస్తూ ఉంటుంది. అట్టి సద్గురు రూపము భూమిపై సంచరించినప్పుడు జీవకోటి ఎంతో ప్రయోజనాన్ని పొందుతుంది. అట్టి సద్గురువు, అరుణాచల ఋషి, భగవాన్ శ్రీరమణమహర్షి తిరుచ్చుళిలో ఒక దేహాన్ని ధరించి, మధురైలో స్వస్వరూపానుభూతిని పొందిన పిమ్మట, ది॥ 01-09-1896న ఆ ఉపాధి అరుణాచలం చేర్చబడింది. అటు పిమ్మట అరుణాచలంలో అతి సామాన్యుని వలె సంచరించిన గురుమూర్తి భగవాన్ యొక్క ప్రతీమాట, ప్రతీచర్య జీవకోటిని స్వరూప ఎరుకలోకి మేల్కొలుపుటకు ఒక పాఠము, మంత్రముగా పనిచేసింది. భగవాన్ జీవించి యున్న కాలంలో వారి జీవిత విధానం, విభిన్న సన్నివేశాలు, మరియు బోధ మానవాళికి సందేశములుగా నిలిచినవి. "నీ స్వరూపము సచ్చిదానందమే! నీవు దేహమాత్రుడవు కాదు, కావున వాస్తవంగా నీవెవరివో? తెలుసుకో! అన్న వారి బోధ అమృతతుల్యము". 'నేను' అంటే ఏమిటో? విచారించి స్వరూప అమృతస్థితిని అనుభవైకవేద్యం చేసుకోవాలన్నదే భగవాన్ మూల సిద్ధాంతం.

సుమారు 62 సంవత్సరముల క్రితమే వారు మానవాకృతిని విసర్జించినప్పటికీ, అనంతమైన పరబ్రహ్మ తత్త్వము వారి ద్వారా నిరంతరాయముగా మానవాళిని ప్రగతి మార్గమున నడుపుతూ, అంతిమ సత్యంలోకి మేల్కొలుపుతూనే ఉంది. భగవాన్ శ్రీరమణమహర్షి యొక్క మార్గదర్శకత్వము, సత్యాన్వేషకులను హృదయంలోకి అంతర్ముఖులను చేసి పరమశాంతిని స్వరూపంగా అనుభవైకవేద్యం చేసుకొనుటకు ఎంతగానో సహకరిస్తుంది. అట్టి శ్రీరమణ గురువుకు పరిపూర్ణముగా శరణాగతి చెందితే వారిమార్గదర్శకత్వము, అనుగ్రహము వలన ఇహపర లాభమును నిశ్చయముగా పొందగలము. **(ది॥ 29-12-2012 శ్రీరమణ జయంతి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి**, అమలాపురం

# గురువు అంటే పరుసవేది - ఆయన సమక్షమే అసలైన జీవితం - 2వ భాగం

మన ప్రేమ గురువుతో పరిపూర్ణమైతే వెంటనే వారితో మనకు అనుసంధానం కలుగుతుంది. ఆయన మార్గదర్శి అయితే అది మనకు ఎంతో విలువైన సంపద. మనలో మనకు తెలియకుండా ఉన్న అసూయత, జ్వరం లాంటిది. ఆ జ్వరం తగ్గటానికి వైద్యుడు సహకరించినట్లే అరిషడ్‌వర్గాలతో కూడిన అసూయత నిర్మూలనకు గురువు వైద్యుడౌతాడు. గురువు స్వతంత్రుడై ఉంటాడు. సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, ఆచారాలు, ఆనవాయితీలను వెనక్కు నెట్టగలడు. ఆయన బోధ బయటనుంచి తెచ్చుకొన్నదికాదు. సమాధినుంచి జాలువారే స్థితప్రజ్ఞత సుగంధం. శిష్యులలో కొంతమంది ఆయన్ని గౌరవస్థానంలోకి ఎత్తటానికి, అవమానస్థాయికి దిగతోయటానికి శక్తి సంపన్నులుగా ఉంటారు. గురువు దేన్ని పట్టించుకోడు. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లోంచి సాధకులు గురువును చేరుకొంటారు దారి తెలియకపోయినా ఏదో అజ్ఞాతశక్తి వారిని లాక్కొని వస్తుంది. గురువు మౌనంలో సుగంధం అక్కడకు అందుతుంది దానికి దృశ్యంతో సంబంధంలేదు. చరిత్రపుట్టినప్పటినుంచి అన్ని కాలాల్లోనూ ఇలాగే జరుగుతోంది. సాధారణంగా ఏ ఒక్క పండితుడు తనకన్న ఉన్నత స్థితిలో ఉన్న వానితో కలసి పనిచెయ్యటానికి ఇష్టపడడు. అధమునితో కలసి జీవిస్తే తను గొప్పవాడిని అనే వాసన అహంకారాన్ని కలుగజేస్తుంది. గురువుతో మనం ఉండాలంటే చెత్త అహంకారాన్ని వదిలి శరణాగతుడివి కావాలి. అందుకనే జనులు వారిని స్వీకరించరు. క్లబ్‌లకు వెళితే అక్కడ ఉన్నది అంతా తెలివితక్కువ వారే అందుకే ఇష్టం. జన సమూహం ఉంటే మనలోని వెలితిని మర్చిపోవటానికి వీలుంటుంది. గురువు దగ్గర అది సాగదు. గురువు వద్ద చాలాకాలం జీవించవలసిన అవసరంలేదు. పక్వతకు వస్తే ఒక్క క్షణం చాలు అంటారు అనుభవజ్ఞులు. భగవాన్ వద్దకు కొన్ని నిమిషాలు ఉండి సంతృప్తిపడి వెళ్ళిపోయినవారు చాలామంది ఉన్నారు. అక్కడ గురువును ఎంత లోతుగా ప్రేమిస్తున్నామనేదే విశేషం. ఒక్క క్షణం జాగృతి, సమ్యక్ స్మృతి, మౌనం ఉంటే చాలు దానివల్ల జరిగే ప్రసారం శాస్త్రాలు కలుగజేసే ప్రభావాన్ని మించి ఉంటుంది. మూఢుడు తనకు తానే శత్రువుగా తప్పలు ఎన్నో చేస్తూ జీవితం అంతా నరకంలో దొర్లుతాడు అలా సాగుతాడు. జీవితానికి సంబంధించిన దివ్యజ్ఞానం అందరిలోనూ ఉంటుంది. మూర్ఖుడు చెవులు మూసుకొంటూ నిర్లక్ష్యంగా ఉంటాడు. ఆ దివ్య విశేషాలను భ్రమగా కొట్టిపారేస్తాడు. వాస్తవమైన గురువు ఆతను గడ్డిపరక ప్రమాణంలో ఉన్న అనుగ్రహంతో గురువుగా తీర్చిదిద్దుతాడు. అనుచరులను కాదు. గురువు మనలను లోపలికి ఎగతన్నుతాడు. మనలను స్వతంత్రంగా చేసి ఉద్ధరిస్తాడు. అదే ఆయన జీవితలక్ష్యం. మనం ఎన్నో జన్మలనుంచి పరతంత్రంగా జీవిస్తున్నాము. అది ప్రగతి కాదు. చీకటికోణంలో తడుముకొంటున్నాము. ఆత్మను పొందలేకపోతున్నాము. శ్రీనాన్నగారు "మీ ఆలోచనాస్థాయి పడిపోకుండా అస్తిత్వాన్ని కాపాడుకో" అని ఆశీర్వదిస్తారు. ఆయన మనలను ప్రేమిస్తారు తన కరుణను జాలువారేలా చూపుల ద్వారా, స్పర్శద్వారా, చింతన ద్వారా అనుగ్రహాన్ని కలుగజేస్తారు. పరిశోధించి సత్యాన్ని తెలుసుకోవటానికి సిద్ధంగా ఉన్నవారు మాత్రమే జీవితం చాలా అందమైన తీర్థయాత్ర అవుతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**